

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## మనిషికి కావాల్సింది

**"సూరిబాబు పోయాడు"** కామేశానికి మంచినీళ్ళగ్లాస్ అందిస్తూ చెప్పింది భారతి.

"ఎక్కడికి?" పరధ్యానంగా అడిగాడు కామేశం.

"నాకు తెలిసి నరకానికే పోయుంటాడు" భారతి వ్యంగ్యంగా చెప్పింది.

మరుక్షణం ఆమె చెంప ఛెళ్ళుమంది.

"అడిగిందానికి సూటిగా జవాబు చెప్పు, డొంక తిరుగుడు మాటలంటే నాకు చిరాకని ఎన్నిసార్లు చెప్పాను?" ఉగ్రంగా అరిచాడు కామేశం.

చెంపమీద తడుముకుంటూ విసిరేసిన గ్లాసుని వంగి తీసుకుని భారతి లోపలకి నడవబోయింది.

"చెప్పాలనుకున్నదేదో సూటిగా చెప్పేడు. ఎక్కడికిపోయాడు సూరిగాడు?" కామేశం చొక్కా విప్పుకుంటూ అడిగాడు.

"చచ్చిపోయాడు."

"ఏమిటి? ఎప్పుడు?" నిశ్చేష్టుడయ్యాడు కామేశం.

"పొద్దున. మీరు ఆఫీస్‌కి వెళ్ళిన అరగంటకి అనుకుంటా" భారతి అతనికి సాధ్యమైనంత దూరంగా నిలబడి చెప్పింది.

"ఎలా?"

"పొద్దున ఎనిమిదింటికి మొక్కలకి నీళ్ళు పోసి ఆ వెనక అరుగు మీద కూర్చున్నాడట. అన్నపూర్ణ కాఫీ తెచ్చిచ్చి పనుండి లోపలి వెళ్ళి మర్చిపోయిందిట. కాఫీ తాగాక వచ్చి వెంటనే ఆ గ్లాస్ తీసుకెళ్ళకపోతే అరుస్తాట్ట. అందుకని అరగంట తర్వాత భయపడి వెళ్తే పక్కకి వాలిపోయి ఉన్నాడంట. కాఫీగ్లాస్ కింద పడివుందిట" ఏకబిగిన చెప్పింది భారతి.

"అంత అనాయాస మరణమా?" విస్తుబోయాడు కామేశం.

"నేనూ అదే అనుకున్నా"

"మరి ఇంట్లో సందడేం లేదు?" పక్కింటి వైపు చూస్తూ అడిగాడు.

"సందడి ఏముంది? ఒంటిగంటకల్లా వాళ్ళబ్బాయి శవాన్ని గాంధీ హాస్పిటల్‌కి పంపేసాడు."

"ఏంటీ?" కామేశం నిర్ఘాంతపోయాడు.

భారతి మౌనంగా ఉండిపోయింది.

"కొడుకు ఉండి తలకొరివి పెట్టలేదా?" గొణిగాడు.

కామేశానికి ఇద్దరూ అమ్మాయిలే. సూరిబాబుకి ఒక్కడే కొడుకు. అందుకు కామేశం మనసులో అనేకసార్లు కుళ్ళుకున్నాడు కూడా.

"ఎందుకలా?"

"ఏమో?"

భారతి వంటగదిలోకి వెళ్ళిపోయింది.

వికల మనస్సుతో కామేశం మేడమీదకి వెళ్ళాడు.

కామేశం ఈ లోకంలో ఉన్న శత్రువుల్లో అత్యంత శత్రువు, పక్కలో బల్లెం సూరిబాబు. కామేశం ఆ ఇల్లు కట్టేప్పుడు పర్యవేక్షణకి వచ్చినప్పుడే సూరిబాబు ఇంట్లోంచి ఆయన కంఠం పెద్దగా వినిపిస్తూండేది. పైనించి ఇసకపడిందని, సిమెంట్ పడి మొక్కలు పాడైపోతున్నాయని, కూలీలు గోలగా మాట్లాడుకుంటున్నారని సూపర్‌వైజర్‌తో రోజూ గొడవపెట్టుకునేవాడు.

గృహప్రవేశం రోజు 'వీధంతా వాడేసుకున్నారని, విస్తరాకులు, ఎక్కడ పడితే అక్కడ పడేసారని' కామేశంతో కయ్యం పెట్టుకున్నాడు.

కామేశం కూడా ధీటుగానే జవాబు చెప్పాడు. ఆ తర్వాత ఫేమిలీతో ఆ ఇంట్లోకి మారాక ఆ గొడవలు అధికమయ్యాయి. ఆడవారు స్నేహితులయ్యారు కానీ కామేశానికి, సూరిబాబుకి మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనేది. ఆ వీధిలో మొట్టమొదట ఇల్లు కట్టుకుని చేరింది తనేనని, తన తర్వాత వచ్చిన వాళ్ళు తన పెద్దరికానికి గౌరవం ఇవ్వడంలేదని సూరిబాబుకి బాధ. స్వతహా పేచీకోరు అయిన ఆయన రోజూ ఎవరితో ఒకరితో గొడవపెట్టుకుని అరుస్తూనే ఉండేవాడు. ఎవరో కరివేపాకు కోసుకుపోయారని, ఇంకెవరో మామిడికాయకోసం రాళ్ళు విసిరేతే కిటికీ అద్దాలు పగిలిపోయాయని పేచీ పెట్టుకునేవాడు.

కామేశం కూడా పేచీ మనిషి అవడంతో స్వజాతి ధృవాలు వికర్షించుకున్నాయి. బయటివారితోనేకాదు ఇద్దరికీ ఇంట్లోవారితో కూడా పడదు. సూరిబాబు కొడుకుని, భార్యని ఇష్టం వచ్చినట్లు తిడుతూండేవాడు. కోడల్ని అనాల్సి వచ్చినప్పుడు కూడా భార్యనే తిట్టేవాడు. రిటైరైన ఆయన సింహంలా గర్జిస్తూనే ఉండేవాడు. కామేశానికి కాలేజీలో చదివే ఇద్దరు కూతుళ్ళు, భార్య. నిర్మొహమాటంగా అందర్నీ ఇష్టం వచ్చినట్లల్లా తిడుతూనే ఉంటాడు. పెళ్ళాం పిల్లల్ని ఆ భయంలో ఉంచాలని అతని ఉద్దేశం.

మేడమీంచి పక్కింట్లోకి చూసాడు కామేశం. నిశ్శబ్దంగా ఉంది. వెనక పెరట్లో సూరిబాబు పెంచిన వృక్షాలు, మొక్కలు పచ్చగా కళకళ్ళాడుతున్నాయి.

భారతి కాఫీ తీసుకువచ్చింది.

"కనీసం బంధుమిత్రులు వచ్చి చివరిచూపు చూసేదాకానైనా ఉంచలేదా?" కప్ అందుకుంటూ అడిగాడు.

"ఆయనకి మిత్రులెవరూ లేరుట. తమ్ముడితో ఆస్తి విషయంలో గొడవలు వచ్చి మాట్లాడటం మానేసాడట. 'తల్లి నగలు కూతుళ్ళకి చెందుతాయి' అని అన్నారని అక్కచెల్లెళ్ళని నానాతిట్లు తిట్టి ఇంట్లోంచి వెళ్ళగొట్టాడట. వియ్యాలవాళ్ళు అమెరికాలో కొడుకు దగ్గర ఉన్నారట. ఇంకెవరున్నారు?"

"నువ్వెళ్ళి చూసొచ్చావా?" అడిగాడు.

భారతి తటపటాయించింది. ఏం చెపితే ఏమంటాడో అనే భయంతో నెమ్మదిగా చెప్పింది.

"వెళ్ళాను. మీ మగాళ్ళ మధ్య లక్ష వుండచ్చు. కానీ అన్నపూర్ణ నా పెద్దక్కలాంటిది. వెళ్ళకపోతే ఎలా? తెల్లారి లేస్తే మొహాలు చూసుకోవాలి."

"ఎలా ఉన్నాడు? మొహం బాగా బాధపడినట్లుగా ఉందా?"

"ఏమో? వరండాలో పడుకోబెట్టారు. మొత్తం దుప్పటి కప్పేసారు. వాళ్ళబ్బాయి పక్కన కుర్చీవేసిక్కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. 'అమ్మలోపలుంది వెళ్ళండాంటీ' అన్నాడు. లోపలికి వెళ్తే అన్నపూర్ణ హాల్లో ఏదో సర్దుతోంది.

'నన్ను చూసి డైనింగ్ టేబుల్ ఛైర్‌లో కూర్చో భారతీ. చెక్కకదా మైల వుండదు' అంది. కోడలు ఏం చేస్తోందో కనపడలేదు. ఏం మాట్లాడాలో తెలీలేదు. 'ఎలా పోయారని' అడిగితే చెప్పింది. వాళ్ళబ్బాయి ఇంకా ఆఫీస్‌కి బయలుదేరలేదట. పిలిస్తే వచ్చి, కొడుకు, కోడలు ఆయన శవాన్ని వరండాలో పడుకోబెట్టి కంటి హాస్పిటల్‌కి ఫోన్ చేసారట. వాళ్ళు వచ్చి కార్నియాలు తీసుకెళ్ళారట. తర్వాత గాంధీ హాస్పిటల్‌కి ఫోన్ చేసి, వాళ్ళ కాలేజ్ కోసం డెడ్ బాడీని తీసుకెళ్ళమని చెప్పారట. వాళ్ళకోసం వెయిట్ చేస్తున్నాం అని చెప్పింది."

"హుం" కామేశం మూలిగాడు.

"వాళ్ళకి వంటచేసి పంపుతానని చెప్పాను. కానీ కోడలు వండుతోంది వద్దు అని చెప్పింది. ఇంక ఇంటికి వచ్చేసాను. ఒంటిగంటకల్లా మెడికల్ కాలేజ్ వేన్ వచ్చి శవాన్ని తీసుకెళ్ళింది."

"సరే. వెళ్ళి పని చూసుకో" కామేశం ఖాళీ కప్పుని భార్య చేతిలో పెట్టాడు.

'శవం' అన్నమాట వినడానికి అతనికి దుర్భరంగా ఉంది. నిన్న సాయంత్రం కూడా సూరిబాబు తనతో గొడవపడ్డాడు. తమ అశోక చెట్ల ఆకు వాళ్ళింట్లోకి రాలుతున్నాయని, ఓ పువ్వు, పిందె, కాయ లేని చెట్లని పెంచుకుని పక్కవాళ్ళ ప్రాణాలు తీస్తున్నాడని అరిచాడు. తర్వాత ఆ ఆకులన్నీ ఊడ్చి ఎత్తి కాంపౌండ్ వాల్ మీంచి తమ ఇంట్లోకి పోసాడు. తనూ దీటుగానే అరిచాడు. వాళ్ళ కొబ్బరిచెట్టు వంగిపోయి, ఏ క్షణాన తమ ఇంటిమీద పడుతుందో అని భయంతో వణికి ఛస్తున్నానని చెప్పాడు. అరగంటలో సూరిబాబు మనుషుల్ని పిలుచుకు వచ్చి ఆ కొబ్బరి చెట్లని కొట్టించేసాడు. ఈ రోజు ఇలా..

కామేశం పక్కింట్లోకి చూసాడు. సూరిబాబు కొడుకు, కోడలు పెరట్లో అరుగుమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. దాని మీదే కొన్ని గంటల క్రితం ఓ ప్రాణం పోయిందని తెలీదన్నట్లుగా వాళ్ళు ఏ పార్క్‌లోనో కూర్చున్నట్లుగా కూర్చున్నారు.

సూరిబాబు కొడుకుని కోడలితో మాట్లాడనిచ్చేవాడు కాదు. 'ఏమైనా ఉంటే మీగదిలోనే. ఇంట్లో పెద్ద వాళ్ళముందు రాసుకు పూసుకు తిరగడాలు, ఇకయికలు, పకపకలు కుదరవు. ఇది సంసారుల కొంప' అని అరిచేవాడు. కోడలు బయట కనిపించేది కాదు. ఇప్పుడు ఎంత ధీమాగా, స్వేచ్ఛగా కబుర్లు చెప్పుకుంటున్నారో.

అన్నపూర్ణ స్టీల్ ప్లేట్‌లో మూడు కాఫీ గ్లాసులు తీసుకొచ్చి వాళ్ళకి అందించి, తనూ ఓ గ్లాస్ తీసుకుని మెట్టుమీద కూర్చుంది. ముగ్గురూ కాఫీ తాగుతూ తగ్గు స్వరంతో ఏదో మాట్లాడుకుంటున్నారు. వాళ్ళని చూస్తే కామేశానికి దుఃఖం వచ్చింది. పాపం సూరిబాబు ఏ మార్చురీలో పడుంటే, వీళ్ళిలా హాయిగా కాఫీలు తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారా? ఇంటిపెద్ద పోయాడన్న బాధ పెళ్ళాంతో సహా ఎవరిలో కనపడటంలేదు. వీళ్ళ కోసం ఆయనంత చేసినా కృతజ్ఞత లేని మనుషులు.

ఆలోచనలతో కామేశానికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. జీవితం క్షణభంగురం అని తెలిసినా, సూరిబాబు కుటుంబ సభ్యుల ప్రవర్తన అతనికి నచ్చలేదు. ఓ భర్త, ఓ తండ్రిపోతే వాళ్ళ స్పందన ఇదా!

"కర్మకాండలు ఎప్పటినించి మొదలు పెడతారట?" వారం తర్వాత భార్యని అడిగాడు కామేశం.

"అవేమి చేయరట"

"కర్మకూడా చేయరా?" కామేశం ఆశ్చర్యపోయాడు.

"అవును. వాళ్ళబ్బాయి నాస్తికుడుట. గుండు చేసుకుని కర్మ చేయడాల్లో నమ్మకంలేదుట. అనాథ శరణాలయాలకి ఆయన పేరు మీద పదివేలు డొనేషన్ ఇచ్చాడట. అంతే"

"చావు వార్త తెలిసిన మిగిలిన బంధువులెవరైనా వచ్చారా?"

"ఒక్కళ్ళు కూడా రాలేదు. అన్నపూర్ణ తమ్ముడు, చెల్లెలు మాత్రం 'అక్కాయ్! నీకెన్నాళ్ళకి చెరవదిలిందే' అన్నారట. వచ్చే నెల్లో వాళ్ళు వచ్చి ఓ వారం ఉండిపోతాం అన్నారట."

సూరిబాబు తనవాళ్ళు ఎవర్నీ గడపతొక్కనివ్వడని అన్నపూర్ణ బాధపడటం కామేశానికి తెలుసు. పుట్టింటివైపు జరిగే పెళ్ళి పేరంటాలు వేటికీ ఆవిడ్ని పంపలేదు.

"సూరిబాబూ! నువ్వు లేవు. కానీ ప్రపంచమంతా ఉంది. నువ్వు నిషేధించినవన్నీ మళ్ళీ జరిగిపోతున్నాయి. నీ కొడుకు కోడలు నువ్వు పెంచిన మొక్కల్లో కూర్చుని సరసాలాడుకుంటున్నారు. నువ్వు ఛీ కొట్టిన బావమరిది నీ ఇంటికి వచ్చి వారం పదిరోజులు ఉండబోతున్నాడు' అనుకున్నాడు.

చిత్రంగా కామేశానికి దుఃఖం వచ్చింది.

మరో నాలుగు రోజుల తర్వాత భార్యని అడిగాడు.

"సూరిబాబు భార్య పసుపు కుంకాలు మానేసిందా?"

భారతి భర్తవైపు ఆశ్చర్యంగా చూసింది. ఏదో అనబోయి, భయంతో ఆగిపోయి చెప్పింది.

"లేదు. వాళ్ళబ్బాయ్ ఒద్దు అన్నాడట. అన్నపూర్ణకి కూడా ఇష్టం లేదట. 'కుంకుమకి, సూరిబాబు చావుకి సంబంధం ఏమిటి భారతీ' అంది నాతో"

"అలా అందా? నిజంగా సూరిబాబు అందా? మా ఆయన అందా?"

"సూరిబాబనే అంది."

"నువ్వు రేపటినించి ఆవిడతో మాట్లాడకు" శాసించాడు.

"ఏం?" నిర్ఘాంతపోయింది భారతి.

"మొగుడు రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించి, ఇల్లూ వాకిలి ఏర్పాటు చేసి, ఇప్పుడు కూడా కనీసం ఇరవై, ముప్పైవేల పెన్షన్ వచ్చేలా చేసిపోతే ఓ చుక్క కన్నీరు కార్చలేదు సరికదా సూరిబాబు అంటుందా మర్యాద లేకుండా?" కోపంగా అరిచాడు.

"మీకు ఆయన మీద ఇంత అభిమానం ఎప్పటినించి?" భారతి విడ్డూరంగా చూస్తూ అడిగింది.

"అభిమానం కాదు. మానవత్వం."

"అదే! బతికున్నంత కాలం ఆయనలో ఆ మానవత్వం ఉంటే పెళ్ళాం పిల్లల ప్రవర్తన అలా ఉండేది కాదు. ఓ మనిషి లేకపోతే ‘అయ్యో’ అనుకోవాలి కాని ‘అమ్మయ్య’ అనుకోకూడదు ఆయన అన్నపూర్ణని ఎంత వేధించాడో, కష్టపెట్టాడో ఆవిడ చెప్పింది. ఎంత ఇల్లూ వాకిలి, డబ్బు దస్కం ఉన్నా సింహం బోనులో బిక్కు బిక్కుమని బతకడం ఎవరికీ ఇష్టం లేదు. అంతకంటే స్వేచ్ఛగా అడుక్కుతినడం మేలు."

"నీలాంటి వాళ్ళవి ఆ అడుక్కుతినే బుద్ధులే. నీ బాబుననాలి." కోపంగా ఓ అడుగు ముందుకేసాడు కామేశం.

"మీరు నన్ను కొట్టినా సరే. ముందుగా నేను చెప్పేది వినండి. సూరిబాబు పోయినప్పటినించి మీరెంత మథన పడుతున్నారో నాకు తెలుసు. ‘నాన్నేంటమ్మా వారం నించి తిట్టడంలేదు’ అని చిన్నది ఆశ్చర్యపోయింది కూడా. మనుషులు శాశ్వతం కాదు. కాని మంచి మనుషులు పోయాక తమ వాళ్ళ గుండెల్లో సజీవంగా ఉంటారు. సూరిబాబులాంటి ఉన్నప్పుడే పోయినవాళ్ళతో సమానం. అలాంటివాళ్ళు చస్తే, వాళ్ళెందుకు బాధపడాలి? హిట్లర్ పోయినప్పుడు నరకాసురుడు పోయినప్పుడు ఎవరైనా బాధపడ్డారా? పండగ చేసుకున్నారు. తాము పోయాక తమవారి మనసుల్లో బతికుండాలి అనుకునేవాళ్ళ ప్రవర్తన వేరేగా ఉంటుంది" భారతి మొండిగా చెప్పింది.

"అంటే? రేపు నేను పోయినా అంతేనా?"

"అది మీరు ఆత్మ విమర్శ చేసుకోవాలి" భారతి వెళ్ళిపోయింది.

కామేశం పడక్కుర్చీలో కూలబడ్డాడు. అతనికి భారతిని వంచి వీపు మీద నాలుగు గుద్దులు గుద్దాలని వుంది. కానీ శారీరకంగా, మానసికంగా కూడా బలహీనంగా ఉండి స్పందించలేకపోయాడు.

పక్కగదిలోంచి తల్లీకూతుళ్ళ గుసగుసలు వినిపిస్తున్నాయి.

"ఎందుకమ్మా నీకు నాన్నతో. మొన్న ఆయన కొట్టిన దెబ్బలకి గోడమీదపడి, తల దిమ్మెక్కిందన్నావు. సూరిబాబు పోయినరోజు దెబ్బకి కన్ను వారం రోజులు మూసుకుపోయింది. ఆయనతో నువ్వు గెలవలేవు. అలాంటప్పుడు అవసరమా ఈ వాదాలు?" పెద్ద కూతురు అడుగుతోంది.

"పెళ్ళయి ముప్పైఏళ్ళయ్యింది. ఈ రోజుకీ ఆయనకి ‘ఏమంటే కోపం వస్తుంది? ఏమంటే రాదు’ అన్నది తెలుసుకోలేకపోయా" భారతి బలహీనంగా చెప్తోంది.

"మనిషైతే ఎప్పుడు ఎలా వుంటాడో ఊహించొచ్చు.. నాన్న పశువు. పశువు ఇష్టం వచ్చినట్లు బిహేవ్ చేస్తుంది. నువ్వేకాదు. ఎవరూ తెలుసుకోలేరు. అక్క పిజి డిస్టింక్షన్‌లో పాసైంది. ఐ.ఏ.ఎస్‌కి ప్రిపేర్ అవుతోంది. దాన్నికూడా ఆయన కొడతాడు. నాన్న జనాభా లెక్కల్లోనే మనిషి" చిన్న కూతురు ఆవేశంగా అరిచింది.

"ష్ నెమ్మది! చంపేస్తాడే" పెద్ద కూతురు భయంగా చెప్పింది.

"ఏంటక్కా ఇది. ఎంతకాలం? పెళ్ళిచేసుకుని వెళితే చచ్చినా ఈ ఇంట్లో కాలు పెట్టను" చిన్నకూతురు శపథం చేసింది.

భారతి గొంతు వినిపించలేదు. వెక్కిళ్ళు వినిపిస్తున్నాయ్. మరోసారైతే లేచి వెళ్ళి చిన్నకూతురు రక్తం కళ్ళ చూసేవాడు కానీ చిత్రంగా ఆ రోజు కుర్చీలోంచి లేవలేకపోయాడు.

రోజురోజుకీ కామేశం కృంగిపోతున్నాడు. సూరిబాబు మరణం, తదనంతర పరిణామాలు అతనికి మింగుడు పడటంలేదు.

పక్కింట్లో రోజుకో మార్పు. ఇల్లు కొంతకాలం బంధువులతో కళకళలాడింది. అన్నపూర్ణ కూడా కళకళలాడుతూ వాళ్ళతో కబుర్లు చెప్పింది. ఇంటికి రంగులు వేసారు. మొక్కల బాధ్యత కోడలు తీసుకుంది. ఆ అమ్మాయి పాటలు పాడుతూ, వాటితో కబుర్లు చెప్తూ వాటి సంరక్షణ చూస్తుంది.

మామగారున్నప్పుడు బయటకి అడుగుపెట్టని ఆమె స్వేచ్ఛగా తిరుగుతోంది. కొత్తగా నైటీ వేసుకుని బయటికి వస్తోంది.

ఓ రోజు ఆఫీస్‌నించి వస్తూ పక్కింటికి తాళం వేసి ఉండటం గమనించాడు. అతను అడక్కుండానే భారతి చెప్పింది.

"అన్నపూర్ణ వాళ్ళు పదిరోజులు కేరళ ట్రిప్‌కి వెళ్ళారు. ఆవిడకి చిన్నప్పటి కోరికట బేక్ వాటర్స్, హౌస్ బోట్స్ చూడటం."

కామేశం మనసులోనే పళ్ళు నూరాడు.

"తమరికేం తీరని కోరికలున్నాయో?" వ్యంగ్యంగా అడిగాడు.

భారతి చురుక్కున చూసింది. ఏదో అనబోయి తమాయించుకుని అక్కడినించి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి కామేశానికి ఆలోచనలతో నిద్రపట్టలేదు. తను కాని, సూరిబాబు కాని పోతామనుకోలేదు. శాశ్వతంగా ఉంటామనే అనుకున్నారు. కాని సూరిబాబు వెళ్ళిపోయాడు. అది కుటుంబ సభ్యుల్లో ఎంత మార్పుని తెచ్చింది? ఇంతకాలం తను కూడా తనంటే భయపడే భార్యా పిల్లల్ని చూసి గర్వపడ్డాడు. వాళ్ళని అలాగే అణచి వుంచాలనుకున్నాడు. వాళ్ళని భయభక్తుల్లో ఉంచాలనుకున్నాడు. ఏనాడూ భార్యతో అనురాగంగా మాట్లాడలేదు. పిల్లల్ని దగ్గరకి చేరదియ్యలేదు. భారతి అన్నట్లు సింహంలా బతికాడు. కాని తను పోయాక తన కుటుంబం కూడా అచ్చం సూరిబాబు కుటుంబంలానే ప్రవర్తిస్తుంది. వాళ్ళెవరూ తనని తలచుకోరు. ఒక్క కన్నీటి బొట్టు విడవరు. తమ పిల్లలకి తనపేరు పెట్టరు. తను వాళ్ళ హృదయాల్లో ఉండదు. మరి ఇంత కఠినంగా ఉండి తను సాధించిందేమిటి?

ఆ రాత్రి నిద్రలోనే గుండె పోటుతో కామేశం మరణించాడు

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments